

బహుమతులు అందజేస్తున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

# యువత క్రీడల్లో రాణించాలి

**మంథని అసెంబ్లీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్**

మంథని, అక్టోబర్ 25: యువత క్రీడల్లో రాణిస్తూ ఉన్న ఊరుకు.. కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ సూచించారు. గత నాలుగు రోజులుగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆకుల భవాని శంకర్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేతలకు బుధవారం రాత్రి పుట్ట మధూకర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి క్రీడల ద్వారా క్రీడాకారుల్లోని నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. ఇలాంటి టోర్నమెంట్‌లు క్రీడాకారుల ప్రతిభకు గుర్తింపు ఇస్తుందని, ప్రతీ క్రీడాకారుడు గొప్పగా ఆడి జాతీయ స్థాయిలో రాణించి మంచి పేరు తీసుకురావాలన్నారు.

# బీఆర్ఎస్‌తోనే సంక్షేమం

- **మంథని అసెంబ్లీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు**
- **బీఆర్ఎస్‌లో పలువురు కాంగ్రెస్ నాయకుల చేరికలు**



పార్టీలో చేరుతున్న కాటారం కాంగ్రెస్ నాయకులకు కండువాలు కప్పుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధు

కాటారం, అక్టోబర్ 25: తెలంగాణలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని జడ్పీ చైర్మన్, మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు అన్నారు. ఈమేరకు మంగళవారం రాత్రి మంథనిలోని రాజగృహలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్ బాబు స్వగ్రామమైన ధన్వాడ మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వెంకటరమణ, ఉపసర్పంచ్ జంగిలి రజిత రమేశ్‌లు బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి పుట్ట మధు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రవేశ పెట్టిన మెనిఫెస్టోలోని పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి వలస వస్తున్నారన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో కూడా అమలు కాని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయంటే ఆ ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. నాయకులు భూపెల్లి రాజు, కిరణ్ గౌడ్, కుమ్మరి అశోక్, బోడ ఏడుకొండలు, తిరుపతి పాల్గొన్నారు.

**నేడు బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం**

మహదేవపూర్ ,అక్టోబర్ 25 : మండల కేంద్రంలో గురువారం ఉదయం 10 గంటలకు ఉమ్మడి మహదేవపూర్ మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ రావు తెలిపారు.ఈ సమావేశాని మంథని అసెంబ్లీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు, జయశంకర్ భూపాలపల్లి జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేశ్ పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

# తనిఖీ బృందాల వాహనాలకు జీపీఎస్

- **విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు**
- **జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బీ గోపి**
- **ఎన్నికల విధులు, బాధ్యతలపై అధికారులతో టెలీకాన్ఫరెన్స్**



ఆర్వోతో మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ బీ గోపి

కలెక్టరేట్, అక్టోబర్ 25: సాధారణ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న వివిధ రకాల తనిఖీ బృందాల వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.గోపి తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల తనిఖీ బృందాలు పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల విధులు, బాధ్యతలపై రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎంపీడీవోలు, సీపీతో కలిసి ఆయన బుధవారం కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ కార్యాలయం నుంచి ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్కడ కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీతో పాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పండుగలు, ఇతర కార్యక్రమాల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, గోడలపై వాల్‌రైటింగ్ చేయడం, గోడ ప్రతులు అతికించడం, బ్యానర్లు ఏర్పాటు చేయడం లాంటి పనులు నిలిపివేయాలన్నారు. గతంలో ఏర్పాటు చేసిన బ్యానర్లను వెంటనే తొలిగించాలన్నారు. నియోజకవర్గాల వారీగా అనుమతిలేకుండా పోస్టర్లు అతికిస్తే, వాటిని సుమోటోగా స్వీకరించి, ఎన్నికల నియమావళి మేరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సర్వేలైన్ బృందాలు, చెక్‌పోస్టులతో పాటు ఏర్పాటు చేసిన బృందాల పనితీరును ఆకస్మికంగా తనిఖీ చేయాలని సూచించారు. కేటాయించిన సిబ్బందికి అటెండెన్స్, మూవ్‌మెంట్ రిజిష్టర్లు పరిశీలించాలని, నియోజకవర్గాల పనితీరును జిల్లా కేంద్రం నుంచి కూడా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో సెలవులతో సంబంధం లేకుండా 24/7 తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పారు. రిటర్నింగ్ అధికారులు నిత్యం నివేదికలు పంపాలని, క్షేత్రస్థాయిలో వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందిస్తూ, ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు అనుమతుల్లేకుండా ఎవరూ కూడా తమ విధులు విస్మరించి వెళ్లకూడదన్నారు. రిటర్నింగ్ అధికారులు జారీ చేసిన అనుమతులకు మించి వాహనాలు వాడకుండా చూడాలని, సభలు, సమావేశాల వివరాలను ఖచ్చితంగా వీడియో రికార్డు చేయించాలన్నారు. అవసరం మేరకు అదనపు సిబ్బందిని కూడా నియమిస్తామన్నారు. అనంతరం సీపీ ఎల్.సుబ్బారాయుడు మాట్లాడారు. రాజకీయ పార్టీలు చేపట్టే ప్రచారాలు, సమావేశాలు, సభలు నిర్వహించే చోట ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు జరుగకుండా కట్టుదిట్టంగా పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. సిబ్బంది విధులకు హాజరుకాని పక్షంలో పైఅధికారులకు వెంటనే సమాచారం అందజేయాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో రిటర్నింగ్ అధికారులు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, కే మహేశ్వర్, రాజు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎస్ఎఫ్‌టీ, వీఎస్‌టీ బృందాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి సాయుధ బలగాల కవాతును ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గోపి

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తాం

- **ప్రజల్లో నమ్మకాన్ని కలిగించేందుకే ఫ్లాగ్ మార్చ్**
- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గోపి**
- **కవాతులో పాల్గొన్న సీపీ సుబ్బారాయుడు, పోలీసులు, కేంద్ర బలగాలు**

రాంనగర్, అక్టోబర్ 25: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ప్రజల్లో ఓటుపై నమ్మకాన్ని, విశ్వాసాన్ని కల్పించే దిశగా జిల్లా వ్యాప్తంగా పోలీసు, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గోపి పేర్కొన్నారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం సాయంత్రం ఆయన పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడుతో కలిసి సాయుధ బలగాల కవాతును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా పటిష్ట భద్రత నడుమ నిర్వహించేందుకు ఇప్పటికే కేంద్ర సాయుధ బలగాలు జిల్లాకు చేరుకున్నాయని తెలిపారు. ఇప్పటికే రూరల్ ప్రాంతాల్లో కవాతు నిర్వహించామని, ముమ్ముందు కూడా కొనసాగిస్తామన్నారు. ఇప్పటికే జిల్లాలో ఎంసీసీ, ఎంసీఎంసీ, స్టాటిక్స్ సర్వైవ్‌లెన్స్ టీం, వీడియో సర్వైవ్‌లెన్ టీం, ఎంటర్ డిస్ట్రిక్ట్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 4 నియోజకవర్గాల్లో ఎన్నికల విధులను విజయవంతం చేయడంలో భాగంగా ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కేంద్ర బలగాలు జిల్లా యంత్రాంగంతో మమేకమై విధులు నిర్వహిస్తారని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో వీరిని కేటాయించడం జరుగుతుందని చెప్పారు. సీపీ సుబ్బారాయుడు మాట్లాడుతూ, ఎన్నికల భద్రతలో భాగంగా కరీంనగర్ జిల్లా కేంద్రానికి మూడు కంపెనీల బీఎస్ఎఫ్ బలగాలు చేరుకున్నాయని, మొదట హుజూరాబాద్, కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాలకు పంపిస్తామని చెప్పారు. త్వరలో మరికొన్ని బలగాలు జిల్లాకు రానున్నాయని, ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించడంతో పాటు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం వంటి చర్యలు చేపట్టే వారికి భయాన్ని కల్పించే దిశగా కవాతును నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 5 చెక్‌పోస్టులతో పాటు ప్రతి నియోజకవర్గానికి 4 ఎస్ఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం పరేడ్ గ్రౌండ్ వద్ద సాయుధ బలగాల కవాతు ప్రారంభమై వన్‌టౌన్, రాజీవ్‌చౌక్, వైశ్య భవన్, గాంధీరోడ్, మంచిర్యాల చౌరస్తా, కోర్టు చౌరస్తా, ఐబీ చౌరస్తా, తెలంగాణచౌక్ మీదుగా తిరిగి పరేడ్ గ్రౌండ్ వరకు కొనసాగింది. డీసీపీలు లక్ష్మీనారాయణ, రాజు, ఏసీపీలు నరేందర్, కరుణాకర్‌రావు, విజయ్‌కుమార్, మాధవి, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నగరంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

# పద్యకవి జీవీ కృష్ణమూర్తి మృతికి సంతాపం

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 25: ప్రముఖ పద్యకవి, కీర్తి పురస్కార గ్రహీత జీవీ కృష్ణమూర్తి బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతదేహం వద్ద పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్ లాల్ నివాళులర్పించారు. ఈ సందర్భగా ఆ యన మాట్లాడుతూ, రామాయణ కుటుంబ సభ్యులు, రాజరాజేశ్వర శతకం, వెంకటేశ్వర శతకం, పద్య మందారం, దేవి శతకం, నీవు శతకం, బాల వెన్నెల వంటి శతకాలు ఆయన రాశారని గుర్తుచేశారు. అలాగే, జీవీ కృష్ణమూర్తి మృతి పట్ల జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్, రామక విఠల శర్మ, సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్, డాక్టర్ వారాల ఆనంద్, డాక్టర్ నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, బొద్దుల లక్ష్మయ్య, వేణుగోపాల ఆచార్య, డాక్టర్ బీవీఎన్ స్వామి, గాజోజ నాగభూషణం, కేఎస్ నంతాచార్య, మాడిశెట్టి గోపాల్, దబ్బెట రాజా రామ్మోహన్ శర్మ, కేబీ శర్మ సంతాపం తెలిపారు.

## బాల్యమిత్రుల చేయూత

జూలపల్లి, అక్టోబర్ 25 : వడ్కాపూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన తోటపల్లి సంతోష్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. వడ్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007వ బ్యాచ్ పదో తరగతి మిత్రులు ఒక్కటై సంతోష్ కుటుంబానికి బుధవారం రూ.14,550 అందజేసి తమ ఉదారత చాటుకున్నారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులు బాల్యమిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెట్టి సతీశ్, కోడి ప్రేమ్, శబ్బీర్, మొగురం అనిల్, అనగోని మహేందర్, స్వామి, ఆగయ్య, తోటపల్లి శంకరయ్య పాల్గొన్నారు.